క్లుప్తంగా

సుబ్రమణ్య స్వామికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలో వెలసివున్న శ్రీ భుజంగేశ్వర ఆలయంలో కొలువైన సుబ్రమణ్య స్వామికి మంగళవారం అర్చకులు యోగేశ్వరశర్మ ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు చేసి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యా సామగ్రి పంపిణీ

పుల్లంపేట : మండల పరిధిలోని ఎస్.బోటుమీదపల్లి పాఠశాలలో సర్వేజన సేవా సమితి సభ్యులు మంగళవారం కీ.శేలు జనార్దన్ యాదవ్ జ్ఞాపకార్థం విద్యార్థులకు విద్యాసామగ్రితోపాటు పాఠశాలకు 20 ఓల్టు వైర్‌లెస్ స్పీకర్‌ను అందజేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.ప్రభాకర్ రెడ్డి సర్వేజన సేవా సమితి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శిల్పకళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

చిట్వేలి : రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈనెల 13న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, రైతు సంఘం నాయకులు తిప్పన ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పేదలకు గ్రామీణ ప్రాంతాలలోని మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెట్లు ఇంటి స్థలం, ప్రతి పేద కుటుంబానికి రెండు ఎకరాలు ప్రభుత్వ భూమిని మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటిస్థలం లేని పేదలందరూ ఈనెల 13న జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వాటర్ ట్యాంక్ నిర్మించాలి

రాయచోటి టౌన్ : పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వాటర్ ట్యాంక్ నిర్మించాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ షేక్ అల్లా బకాష్ డిమాండ్ చేశారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని పాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయచోటి గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో (1972 సంవత్సరంలో) అప్పటి ఎమ్మెల్యే హబీబుల్లా రాయచోటి ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ ట్యాంక్‌ను నిర్మించారని చెప్పారు. అయితే కాలక్రమంలో 2023వ సంవత్సరంలో శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని తొలగించారని చెప్పారు. తరువాత ఆ స్థానంలో ట్యాంక్‌ను నిర్మించడం మరిచారన్నారు. ఇకపై ఆ స్థలంలో వాటర్ ట్యాంక్ నిర్మించి పట్టణ ప్రజల దాహార్తి తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాజుద్దీన్, హఫీజుల్లా, షేక్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

లక్కిరెడ్డిపల్లి : మెదడు, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ కోమాలో ఉన్న కెఎస్ వరప్రసాద్ గత తొమ్మిది నెలల నుంచి తిరుపతిలో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటికే ఆయన వైద్యానికి పెద్ద మొత్తంలో ఖర్చుకాగా చికిత్స మరింత మొత్తం అవసరమైంది. వైద్యశాఖలో పని చేసిన వరప్రసాద్ మానవత సంస్థలో సభ్యులుగా సేవలందించారు. ఆయన పరిస్థితి తెలుసుకున్న మానవత సేవ సంస్థ మండల సభ్యులు మంగళవారం రూ.16,000లను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట సంఖ్యను పొందాలి



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ

పెనగలూరు : మండలంలో సొంతభూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. పీఎం సమ్మాన్ నిధి యోజన (పీఎం కిసాన్) పొందుతున్న ప్రతి లబ్ధిదారులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. ఇందుకోసం భూమి పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబరును వెంట తీసుకొని వెళ్లాలన్నారు. నమోదు చేయించుకోకపోతే పథకాలు, ఇతర ప్రయోజనాలు పొందలేరని వారు తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు విశిష్ట సంఖ్యను ప్రతి రైతు పొందాలని తెలియజేశారు.

డిగ్రీ ఫలితాల్లో సాయి డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

రైల్వేకోడూరు అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం 1, 3, 5 సెమిస్టర్ డిగ్రీ ఫలితాలలో పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ పెంచలయ్య, డైరెక్టర్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్స్‌లో పల్లవి, ప్రత్యూష, పూజిత, ఆయేషా, మునిరాలు, బీకాం కంప్యూటర్స్‌లో మౌనిషా, జస్వంత్‌లు 10/ 10 జీపీఏ సాధించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

వైఎస్సార్‌సీపీ అధినేతను కలిసిన పాపినేని

రాజంపేట : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి మంగళవారం కలిశారు. జిల్లా అధికార ప్రతినిధి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్ధాంతరం.. అవస్థలమయం

పేదల విద్యపై చంద్రబాబు సర్కార్ నిర్లక్ష్యం

- అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా ప్రారంభంకాని నాడు – నేడు పనులు
- పథకం పేరు మార్చిన అభివృద్ధి నోచుకోని వైనం
- ఇక్కట్ల నడుమే విద్యార్థులకు పాఠాలు



అడవికమ్మపల్లె జెడ్పీ హెచ్ఎస్‌లో అర్ధాంతరంగా ఆగిన గదులలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు



అడవికమ్మపల్లె జెడ్పీ పాఠశాల భవనం

సంబేపల్లె : పేదల విద్యపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అయ్యి 8 నెలలు కావొస్తున్న సర్కారు బడులను పట్టించుకున్న పాపానపోలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ బడులలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టకుండా కాలయాపన చేస్తూ ప్రభుత్వ పాఠశాలలను మరుగునపడేలా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాడు – నేడు పథకం పేరును స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ ప్రొగ్రామ్ (ఎస్ఐఐ)గా మార్చారే తప్పా అర్ధాంతరంగా నిలిచిన పనులకు నిధులు కేటాయించి పూర్తి చేసిన సందర్భం ఎక్కడా కనిపించలేదు. దీంతో మండలంలో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తమ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలంటూ ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నాటి సంకల్పానికి తూట్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు – నేడు పథకంలో భాగంగా పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడమే సంకల్పంతో మన బడి నాడు – నేడును ప్రారంభించారు. కార్పొరేట్ స్థాయిలో పేద విద్యార్థులకు చదువు అందాలని పాఠశాలల రూపురేఖలు మార్చడమే కాక బడులలో ఆధునాతన వసతులను కల్పించడమే ధ్యేయంగా గత ప్రభుత్వం ముందుకు సాగింది. ఈ పథకంలో భాగంగా మొదటి విడతలో చాలా వరకు పాఠశాలలను అభివృద్ధి చేయడమే కాక బెంచ్‌లు, ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా విద్యను అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మన నాడు – నేడు పేరు మారిందే గాని బడుల పనులు అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో పలు పాఠశాలల్లో విద్యా సామగ్రికి భద్రత కరువైంది.

ఆగిన పనులతో విద్యార్థులకు తిప్పలు

సంబేపల్లె మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం సమస్యలు తిష్ట వేశాయి. మండలంలో 17 అంగన్వాడీలు, 23 ప్రభుత్వ పాఠశాలలను రెండో విడతలో భాగంగా పనులు చేపట్టేందుకు అనుమతులిచ్చారు. పలు పాఠశాలల్లో పనులు 80 – 90 శాతం పనులు పూర్తి కాగా ఎన్నికలు సమీపించడంతో పనులు నిలిచాయి. నూతన ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు పూర్తయినా ఆయా పనుల పూర్తికి నోచుకోవడంలేదు. దీంతో మండలంలోని దుద్యాల, అడవికమ్మపల్లె, గుట్టపల్లె, దేవపట్ల, రౌతుకుంట, గున్నికుంట్ల, గురిగింజకుంట, సంబేపల్లె, మోటకట్ల, శెట్టిపల్లె, ఎస్.సోమవరం, నారాయణరెడ్డిపల్లె గ్రామాలలో ఎక్కువ శాతం బడుల్లో మల, మూత్రశాలలు శుభ్రంగా లేవు. విద్యార్థులు ఆరుబయటే మూత్ర విసర్జన చేయాల్సి పరిస్థితి నెలకొంది. పలు పాఠశాలలకు ప్రహరీ గోడలు లేక నాడు – నేడు పనులు అర్ధాంతరంగా ఆగి మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. మండల వ్యాప్తంగా అంగన్వాడీ భవనాలు, ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు ఏమీ చేయలేక తమ ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అవస్థల నడుమే విద్యనభ్యసిస్తున్నారు.



పాలెంగడ్డ పాపన్నగారిపల్లె పాఠశాలలో సగంలో ఆగిన ప్రహరీ గోడ నిర్మాణ పనులు



నాడు – నేడులో భాగంగా అభివృద్ధికి నోచుకున్న దేవపట్ల పంచాయతీ రెడ్డివారిపల్లె ఎంపీపీ పాఠశాల

పెండింగ్‌లో పది శాతం పనులు



మండల వ్యాప్తంగా ఆయా పాఠశాలలో నాడు – నేడు పనులు నిలిచిపోయాయి. కొన్ని పాఠశాలలో తరగతి గదులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని పాఠశాలలో పది శాతం మాత్రమే పెండింగ్‌లో వున్నాయి. వెంటనే ప్రభుత్వం పాఠశాలలో నిలిపోయిన పనులపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకొని తరగతి గదులను అందుబాటులోకి తేవాలి.

– శ్రీనివాసులు, ఎంఈఓ–2, సంబేపల్లె మండలం

రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి



రీసర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ తదితరులు

చిట్వేలి : భూముల రీ సర్వే ప్రక్రియను అధికారులు వేగంగా పూర్తి చేయాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం తిమ్మయ్యగారిపల్లిలో జరుగుతున్న రీసర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్, కృష్ణ, వీఆర్‌ఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



బ్రోచర్లను విడుదల చేస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట : అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఈనెల 28న నిర్వహించే జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం అన్నమాచార్య యూనివర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి చాంబరులో కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను విడుదల చేశారు. 28న నిర్వహించే సైన్స్ ఫెయిర్ కాంటెస్ట్ – 2025కు డిగ్రీ, పాలిటెక్నిక్, పీజీ విద్యార్థులతో పాటు అన్ని విభాగాల విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 94933 84398, 99083 44380లో సంప్రదించాలన్నారు.

శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని టీటీడీ నిర్వహించాలి

ఒంటిమిట్ట : శ్రీ కోదండ రామస్వామి ఆలయం ఉండటంతో టీటీడీ మండల కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని ఒంటిమిట్ట చెరువు సంఘం ప్రెసిడెంటు పాటూరి గంగిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన టీటీడీ జేఈఓ వీరబ్రహ్మంను కలుసుకుని మాట్లాడారు. మండలంలో ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, అలాంటి ప్రాంతంలో సాగునీటి కోసం సోమశిల వెనుక జలాలపైన ఆధారపడాల్సి వస్తోందని తెలియజేశారు. ఇందులో భాగంగా ఒంటిమిట్ట చెరువుకు నీటి తీసుకుని వచ్చేందుకు శ్రీరామ ఎత్తిపోతల పథకం కింద నీటిని పంప్ చేస్తున్నారని జేఈఓకు చెప్పారు. ఈ పథకాన్ని టీటీడీనే నిర్వహించి రైతులకు భరోసానివ్వాలని ఆయన్ను కోరారు. అలానే ఒంటిమిట్ట చెరువును ట్యాంక్‌బండ్‌గా మార్చి అభివృద్ధి చేయాలని విన్నవించారు. అనంతరం ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని జేఈఓకు అందజేశారు. సానుకూలంగా స్పందించిన జేఈఓ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బాలరాజు శివరాజు తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చకుంటే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ లిబరేషన్ నేత శంకర్

రాయచోటి అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు శంకర్, రాష్ట్ర కార్యదర్శి బంగారావులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్‌జీఓ సభా భవనంలో ఆ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య అనైక్యతను సృష్టిస్తున్నారన్నారు. కుంభమేళాలో జరుగుతున్న మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని చంద్రబాబు ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి సీఎం గద్దెనెక్కారంటూ విమర్శించారు. బాబు తన పదవిని కాపాడుకునేందుకు బీజేపీకి ఊడిగం చేస్తున్నారంటూ వారు మండిపడ్డారు. ఉపముఖ్యమంత్రి పదవిలో ఉన్న పవన్ కల్యాణ్ సనాతన ధర్మం పేరుతో హిందూ మతాన్ని రెచ్చగొట్టడం సరైంది కాదని తెలియజేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని నిర్మిస్తామంటూ హెచ్చరించారు.

జిల్లా కార్యదర్శిగా మావులూరి విశ్వనాథ

సమావేశంలో అన్నమయ్య జిల్లా సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కార్యదర్శిగా మావులూరి విశ్వనాథను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులుగా సిగి చెన్నయ్య, పి.రమణ, ఎం.సుజాత, రఘునాథనాయుడు, నీలావతి, జయసింహ, ఆంజనేయులు, లవకుమార్, సుబ్బయ్య, వెంకటేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నేతలు రమణయ్య, ఓబయ్యతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గర్భిణులు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి




గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్ శరత్ కమల్

నందలూరు : ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 51 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ కార్తిక్ విశ్వనాథ్‌లు తెలిపారు. గైనకాలజిస్ట్ డాక్టర్ మస్తానమ్మ 42 మంది గర్భిణులకు స్కానింగ్ చేసి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులుగా ఉన్న సమయంలో గుర్రపు వాతము, మధుమేహం, థైరాయిడ్, గుండె జబ్బులు ఉన్నవారిని పరీక్షించి వారు తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తలను తెలియజేశారు. అలానే మందులను పంపిణీ చేశారు. అనంతరం రాయల్ సేవా సమితి అధ్యక్షుడు గంగనపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీల్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, రాయల్ సేవా సమితి సభ్యులు హరి, భరత్, పెంచలయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



నందలూరు: చిన్నారుల ఆరోగ్య వివరాలను తెలుసుకుంటున్న న్యాయవాది వినయ్ కుమార్



సిద్ధవటం: తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సొసైటీ కోఆర్డినేటర్ రవీంద్రనాథ్

సిద్దవటం : బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంటు సొసైటీ సంస్థ కోఆర్డినేటర్ రవీంద్రనాథ్ తెలిపారు. మండలంలోని ఎగువపేట 1వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పిల్లల తల్లిదండ్రులకు, యుక్త వయస్సు మహిళలకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, అత్యాచారాలు నేరమన్నారు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేకుండా చిన్న వయస్సులోనే బాలికలకు వివాహాలు చేస్తున్నారని, మహిళలకు 18 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలు వయస్సు పైబడి ఉండాలన్నారు. అనంతరం తల్లిదండ్రులతో బాల్య వివాహాల నివారణచాలని ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ సరోజినీదేవి, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నందలూరు : బాల్య వివాహాలు చేయడం నేరమని ప్యానల్ న్యాయవాది వినయ్ కుమార్ తెలిపారు. మంగళవారం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో బాల్య వివాహాలపై సర్వే నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారుల ఆరోగ్య వివరాలపై వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ గోపినాథ్ యాదవ్ పాల్గొన్నారు.

ఎల్ఐసీలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి



రాయచోటి అర్బన్: ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు



రాజంపేట టౌన్: నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

రాజంపేట టౌన్ : ఎల్ఐసీలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం రాజంపేట బ్రాంచ్ కార్యదర్శి జి.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఖాళీలను భర్తీ చేయాలన్న డిమాండ్‌తో ఎల్ఐసీ ఉద్యోగులు మంగళవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత తొమ్మిది నెలల్లో 3, 4వ తరగతి ఉద్యోగులు 3,130 మంది వరకు పదవీ విరమణ పొందడం లేదా కాలం చెందారన్నారు. అలాగే చాలా కాలంగా ఖాళీలు భర్తీకి నోచుకోలేదన్నారు. అందువల్ల సిబ్బందిపై పనిభారం రోజురోజుకు పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలానే సాధారణ బీమారంగంలో ఇతర రంగాల్లో ఇచ్చే విధంగా తమ యూనియన్‌కు గుర్తింపును పునరుద్ధరించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 20వ తేదీ గంటపాటు దేశ వ్యాప్తంగా ఎల్ఐసీ సిబ్బంది సమ్మె నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం ఉద్యోగులు సీనియర్ బ్రాంచ్ మేనేజర్ వెంకటసుబ్బయ్యను కలిసి ఖాళీల భర్తీ, యూనియన్ గుర్తింపు అంశాలపై తమ ఆకాంక్షను ఎల్ఐసీ సీఈఓకు తెలియచేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు గంగాధర్, రాఘవేంద్ర, రామప్రసాద్, సుబ్బయ్య, ఖాదర్‌బాషా, రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, రాజశేఖర్‌రెడ్డి, నాగయ్య, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి అర్బన్ : పాలసీదారులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఎల్ఐసీలో 3,4 తరగతుల ఉద్యోగుల నూతన నియామకాలను వెంటనే చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం రాయచోటిశాఖ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలోని ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయం ఎదుట నూతన నియామకాలను చేపట్టాలన్న డిమాండ్‌తో ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. అనంతరం ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని బ్రాంచ్ మేనేజర్ మణివన్నన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు గిరిధర్, వేణుగోపాల్‌రాజు, కల్యాణ్‌కుమార్, సువర్ణ, మధుసూదన్‌రాజు, రామక్రిష్ణమరాజు, లక్ష్మయ్య, జయరాం, విజయకుమార్, హుస్సేన్‌తోపాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫిర్యాదుపై రికార్డుల పరిశీలన

సిద్దవటం : మాధరవం–1 గ్రామ సచివాలయాన్ని డివిజనల్ పంచాయతీ అధికారి విజయ భాస్కర్ మంగళవారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018–19లో చేసిన అభివృద్ధి పనులకు తనకు ఇప్పటి వరకు చెల్లించలేదని పంచాయతీలోని ఎస్‌కేఆర్ నగర్‌కు చెందిన గంజి సుబ్బరాయుడు గత ఏడాది డిసెంబర్ 15వ తేదీన జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయాన్ని సందర్శించి ఇందుకు సంబంధించిన రికార్డులను అధికారి పరిశీలించి ఫిర్యాదు విషయమై రికార్డులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ విశ్వనాథ్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ మోహతాజ్ యాస్మిన్, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీనరసయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

విమర్శించడమే కాక మాపైనే ఫిర్యాదా?



మాట్లాడుతున్న రామస్వామి రెడ్డి తదితరులు

సుండుపల్లె : ఈ నెల 2వ తేదీన పుంగనూరులో జరిగిన జనసేన పార్టీ సభలో సుండుపల్లెకు చెందిన జనసేన మహిళా కార్యకర్త పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించడమే కాక తిరిగి తమ వారిపైనే పోలీసులకు ఫిర్యాదు చేయడాన్ని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పుబట్టారు. మంగళవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామస్వామి రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రహిమన్ ఖాన్, సింగల్ విండో మధుసూదన్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. విమర్శలు చేసే ముందు తమ స్థాయి ఏంటో తెలుసుకోవాలని వారు హితవు పలికారు. తమ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై మండలానికి చెందిన జనసేన వీరమహిళ ఆరోపణలు చేయడాన్ని వారు ఖండించారు. ఎవరి గురించి అయినా ఆరోపణలు చేసే ముందు వారి గురించి పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. అలానే పెద్దిరెడ్డి ఆయన కుటుంబంపై ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ తాము ఇచ్చిన పత్రిక ప్రకటనలో ఫలానా మహిళా అంటూ ఎక్కడా బహిర్గతం చేయలేదని పేర్కొన్నారు. ఇప్పుడు ఆమెనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందని తెలియజేశారు. ఇలాంటి వాటికి తమ పార్టీ వారు ఒక్కరూ భయపడరని, గట్టిగా ఎదుర్కొంటామన్నారు. మా పార్టీ మీద, నాయకుల మీద అసత్య ఆరోపణలు చేస్తే గట్టి సమాధానం చెప్తామని వారు తెలియజేశారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు



కాశిరెడ్డి నాయన మూలవిరాట్

సిద్దవటం : మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న శివుని నల్లె గ్రామం వద్ద వెలసిన శ్రీ కాశిరెడ్డినాయన స్వామి 23వ ఆరాధనోత్సవాలు బుధవారం నుంచి జరుగునని ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలతోపాటు అశ్వర్థ నారాయణ స్వామి కల్యాణం చేయనున్నట్లు తెలియజేశారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. 13వ తేదీన గురువారం ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకరణ, అర్చనలు వంటి పూజా కార్యాక్రమాలను జరుపుతామన్నారు. అనంతరం చెక్కభజన, కోలాటం, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అన్నదాన కార్యక్రమానికి వైఎస్ఆర్‌సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జ్ మేడా మధుసూదన్‌రెడ్డి 30 బస్తాల బియ్యాన్ని అందజేశారన్నారు. తదనంతరం 3 గంటలకు బండలాగుడు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.